# ప్రతి ఇంటా కేసీఆర్ ధీమా

## సంక్షేమ పథం.. సకల జనహితం





- అన్ని వర్గాలు మెచ్చేలా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో
- బీపీఎల్ కుటుంబాలకు రూ.5లక్షల కేసీఆర్ బీమా
- రైతుబంధు దశలవారీగా రూ.16వేలకు పెంపు
- ఆసరా పింఛన్లు రూ.5,016కు, దివ్యాంగులకు రూ.6,016కు పెంపు
- అర్హులైన మహిళలకు రూ.400కే వంటగ్యాస్ సిలిండర్
- అగ్రవర్ణ పేదలకు సైతం గురుకుల విద్య
- రూ.15లక్షలకు ఆరోగ్యశ్రీ గరిష్ఠ పరిమితి
- సీపీఎస్ ఉద్యోగులకు తీపి కబురు
- అసైన్‌ల్యాండ్ పట్టాలు, అనాథ పిల్లలపైనా ప్రత్యేక పాలసీ
- జిల్లా వ్యాప్తంగా సంబురాల్లో సబ్బండ వర్గాలు

*బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. సబ్బండ వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చారు. నల్లగొండ జిల్లాలో 4.70లక్షల కుటుంబాలకు సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలోని అంశాల ద్వారా లబ్ధి చేకూరనుంది. మరింత ఆర్థిక భరోసా లభించనుంది. 'కేసీఆర్ బీమా – ప్రతి ఇంటా భీమా' పథకంలోకి సుమారు 4.66లక్షల బీపీఎల్ కుటుంబాలు రానున్నాయి. అయితే.. ఇందులో రైతు బీమా తరహాలో 59 ఏండ్లలోపు కుటుంబ యజమాని చనిపోతే కారణాలతో సంబంధం లేకుండా ఎల్ఐసీ నుంచి రూ.5లక్షలను నేరుగా ఆ కుటుంబానికి అదనుంది. ఇప్పటికే రైతు బీమా ద్వారా జిల్లా రైతాంగానికి ఆపద సమయాల్లో భరోసా ఇస్తున్నది. ఇప్పటివరకు చాలా మంది బీమాపై అవగాహన లేక కుటుంబ పెద్దను కోల్పోయిన అనంతరం ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న విషయం తెలిసిందే. ఇక తెల్ల రేషన్ కార్డుదారులందరికీ వచ్చే ఏప్రిల్, మే నెల నుంచి సన్నబియ్యం అందిస్తామని ప్రకటించారు. తద్వారా జిల్లాలోని 991 రేషన్ దుకాణాల ద్వారా 4.66లక్షల కుటుంబాలకు ప్రతినెలా 8.96 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అందనుంది.*

– నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ)

### ఆసరా పింఛన్ల పెంపు

2014కు ముందు రూ.200 ఉన్న పింఛన్లను దశల వారీగా పెంచుతూ నేడు వృద్ధులు, వితంతువులకు రూ.2016, దివ్యాంగులకు రూ.3106 ఇస్తున్నారు. వచ్చే మార్చి తర్వాత రూ.3016, దివ్యాంగులకు రూ.4,516 చేయనున్నారు. ప్రతి ఏటా కొంత మేర పెంచుతూ గరిష్ఠంగా నెలకు రూ.5016, దివ్యాంగులకు 6016 రూపాయలకు పెంచనున్నారు. దీని ద్వారా జిల్లాలో 2.12 లక్షల మందికి ప్రయోజనం చేకూరనున్నట్లు అంచనా.

### కేసీఆర్ ఆరోగ్య రక్ష

కేసీఆర్ ఆరోగ్య రక్ష పేరుతో ఆరోగ్యశ్రీ పథకంలో గరిష్ఠ పరిమితిని భారీగా పెంచారు. ప్రస్తుతం రూ.5లక్షలు ఉండగా దాన్ని ఒకేసారి రూ.15లక్షల వరకు పెంచారు. దీంతో అర్హులైన పేదలందరికీ వైద్యపరంగా మరింత మెరుగైన వైద్యసేవలు ఉచితంగా అందుబాటులోకి రానున్నాయి. ఇదే తరహాలో ఉద్యోగులకు, పెన్షనర్లకు, జర్నలిస్టులకు ప్రత్యేక ట్రస్టు ద్వారా ఈహెచ్ఎస్ తరహాలో వైద్య సేవలకు భరోసా ఇచ్చారు.

ఇవి కాకుండా జిల్లాలో ఇండ్ల స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు ఇచ్చేందుకు హామీ ఇచ్చారు. ఇప్పటికే కొనసాగుతున్న గృహలక్ష్మి పథకం దశల వారీగా అందరికీ అందజేస్తామని ప్రకటించారు. ఇక జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 12 అగ్రవర్ణ పేదల గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు మ్యానిఫెస్టోలో వెల్లడించారు. మహిళా సమాఖ్యల కోసం ప్రత్యేక భవనాల నిర్మాణాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా జిల్లాలో 660 భవనాలు అందుబాటులోకి రానున్నాయి. వీటితోపాటు అసైన్డ్ భూములకు సాధారణ భూముల మాదిరిగానే పట్టాలు వర్తింపజేసేలా, అనాథ పిల్లల కోసం ప్రత్యేక పాలసీ రూపొందించినున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే కొనసాగుతున్న అన్ని పథకాలు యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు. మ్యానిఫెస్టో విడుదల తర్వాత జిల్లా అంతటా సంబురాలు జరుపుకొన్నారు. కొన్ని చోట్ల సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేయగా, మరి కొన్ని చోట్ల పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలపై సబ్బండ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తుండగా.. మేధావులు సైతం ప్రశంసలు కురిపిస్తుండడం విశేషం.

### రైతుబంధు పెట్టుబడి సాయం రూ.16వేలకు..

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన రైతుబంధు పథకంపైనా సీఎం కేసీఆర్ మరింత విశాల హృదయంతో స్పందించారు. ఇప్పటికే ఏడాదికి ఎకరానికి రూ.10వేలు ఇస్తున్న సర్కార్ దాన్ని దశల వారీగా రూ.16వేలకు పెంచనున్నారు. వచ్చే ఏడాది నుంచి రూ.12వేలతో ప్రారంభించి.. ఏటా వెయ్యి చొప్పున పెంచుతూ రూ.16వేలు అందజేయనున్నారు. దీంతో జిల్లాలో సుమారు 4.90లక్షల మంది రైతులకు ప్రతి సీజన్‌లో రూ.800 కోట్ల వరకు లబ్ధి చేకూరనుంది. దీని ద్వారా వ్యవసాయ రంగానికి మరింత ఊతమిచ్చినట్లు కానుంది.

### రూ.400లకే గ్యాస్..

అర్హులైన మహిళలందరికీ రూ.400కే వంటగ్యాస్ సిలిండర్ అందించే మరో బృహత్తర పథకం రూపొందించారు. నల్లగొండలో 4.97లక్షల మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. ఇందులో ప్రతి నెలా సుమారు లక్ష సిలిండర్లు రీఫిల్‌కు రానున్నట్లు సమాచారం. ప్రస్తుత ప్రకటనతో జిల్లాలో రానున్న కాలంలో ప్రతి నెలా ఒక్కో సిలిండర్‌పై 800 రూపాయల రాయితీ వినియోగదారుడికి లభించనుంది. పెరుగుతున్న ధరలతో సంబంధం లేకుండా ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగనుంది. ఇదే స్కీమ్‌ను అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టు కుటుంబాలకు వర్తింపజేయనున్నట్లు ప్రకటించారు. దీంతోపాటు మహిళల కోసం ప్రత్యేక భృతి పథకాన్ని కూడా ప్రకటించారు. అర్హులైన వారికి సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా రూ.3వేలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

### అన్ని వర్గాలకు సంతృప్తిగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో



ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో అన్ని వర్గాలకు సంతృప్తిగా ఉన్నది. ఇప్పటికే ఇస్తున్న ప్రజా సంక్షేమ పథకాలే కాకుండా మరిన్ని కొత్త పథకాలు అందిస్తామనడం హర్షణీయం. అనునిత్యం పేదల సంక్షేమం కోరుకొనే వ్యక్తి సీఎంగా ఉండడం మన అదృష్టం. కల్యాణలక్ష్మి, ఆసరా, రైతు బంధు, కేసీఆర్ బీమా పథకాలను మరింత పెంచి అందిస్తామని ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. పేద ప్రజలంతా సీఎం కేసీఆర్ వెన్నంటే ఉంటారు. మాట ఇస్తే మడమ తిప్పని వ్యక్తి కేసీఆర్ సారే మూడో సారి మళ్లీ సీఎం కావడం ఖాయం.

**– డొంకెన మహేందర్‌గౌడ్, రఘునాథపురం, రాజాపేట మండలం**

### సౌభాగ్య లక్ష్మి పథకం చాలా బాగుంది



సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో మహిళల సంక్షేమంలో భాగంగా ఎవరూ ఊహించని విధంగా సౌభాగ్య లక్ష్మి పథకం ప్రకటించారు. దాని ద్వారా అర్హులైన మహిళలందరికీ 3వేల రూపాయలు అందిస్తామని ప్రకటించడం ఆనందంగా ఉంది. ఇప్పటికే అందిస్తున్న కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.లక్షా116 నుంచి 2లక్షలా 116 రూపాయలకు వరకు పెంచుతున్నట్లు ప్రకటించడం సంతోషం. ఇలాంటి ముఖ్యమంత్రి ఎల్లకాలం ఉండాలని మహిళలందరూ కోరుకుంటున్నారు.

**– బీసు ధనలక్ష్మి, ఆత్మకూరు(ఎం)**

### అన్ని వర్గాల సంక్షేమ మ్యానిఫెస్టో



బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టో అన్ని వర్గాల సంక్షేమం దిశగా ఉన్నది. ఇప్పటి వరకు దేశంలో ఏ ప్రభుత్వమూ ఇటువంటివి ప్రకటించిన దాఖలాలు లేవు. రెండు దఫాలుగా జరిగిన ఎన్నికల్లో ప్రకటించిన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను సమగ్రంగా అమలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఇప్పుడు కొత్తగా ప్రకటించిన మేనిఫెస్టో వల్ల రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి ప్రయోజనం కలుగనుంది. రైతు బంధు ఏడాదికి రూ.16వేలు, వంట గ్యాస్ ధర తగ్గింపు, కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమా కింద రూ.10లక్షల ఇన్సూరెన్స్, దళిత బంధు కొనసాగింపు, ఆరోగ్యశ్రీ కింద రూ.15లక్షలు, ఆసరా పింఛన్ల పెంపు, అన్నపూర్ణ పథకం కింద రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, దివ్యాంగుల పింఛన్ నెలకు రూ.6వేలకు పెంపు వంటి పథకాలతో పేదలు, రైతులు మరింత ప్రయోజనం పొందనున్నారు. అదేవిధంగా పల్లె, పట్టణ కార్యక్రమాలతో దేశంలోనే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి హర్షణీయం. స్వరాష్ట్రం సాధించాక రెండు పర్యాయాలుగా సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజల కోసం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబమూ లబ్ధి పొందింది. అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడే బీఆర్ఎస్‌ను ఆదరించి కేసీఆర్‌ను మూడో సారి ముఖ్యమంత్రిని చేయడం కోసం ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

**– కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు**

### దివ్యాంగులకు కొండంత అండ



దివ్యాంగుల సాదక బాధకాలను అర్థం చేసుకొని రూ.3,016 ఆసరా పింఛన్ అందించి ముఖ్యమంత్రి కేసీఆర్ కొండంత అండగా నిలుస్తున్నారు. ఇప్పుడు 4,016 రూపాయలు ఇచ్చి గౌరవంగా జీవించే అవకాశం కల్పిస్తున్నారు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం కేసీఆర్ వెంటే ఉంటాం. గత ప్రభుత్వాలు వికలాంగుల యోగక్షేమాల గురించి ఏనాడూ ఆలోచించలేదు. అరకొర పింఛన్ ఇచ్చి కొండంత ప్రచారం చేసుకునేవారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసరా పింఛన్ 6,016 రూపాయలకు పెంచుతామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం.

**– పన్నాల పద్మారెడ్డి, కంచనపల్లి, వలిగొండ మండలం**

### కేసీఆర్ సారు చెప్పినయి తప్పకుండా చేస్తడు..



రైతు బంధు సాయంతోనే వ్యవసాయం ముందుకు సాగుతుంది. గతంలో ఏ ప్రభుత్వమూ ఈ పథకం పెట్టలేదు. రైతుల గురించి అందరు సభల్లో మాట్లాడేవారే కానీ.. రైతులకు అక్కరకు వచ్చే పథకాలు ఎవరూ పెట్టలేదు. సీఎం కేసీఆర్ సారు అడుగకుండానే ప్రతి ఏటా రూ.10వేల సాయం అందిస్తుండు. దానిని రూ.15వేలకు పెంచుతానని ప్రకటించడం సంతోషంగా ఉంది. కేసీఆర్ సారు మాటపై పూర్తి నమ్మకం ఉంది. ఆయన చెప్పినవి తప్పకుండా చేస్తడు. ప్రస్తుతం వస్తున్న పెట్టుబడి సాయంతో మధ్య దళారుల వద్ద అప్పు తేవడం బంద్ అయ్యింది. ప్రభుత్వం ఇస్తున్న పైసలతో పెట్టుబడికి ఢోకా లేదు. కేసీఆర్ పాలనలోనే రైతు రాజుగా మారిండు. మిగతా పార్టీలు ఎన్ని చెప్పినా నమ్మం. ఓట్లు వేసుకున్న తర్వాత తలదన్నే రకం. రైతులకు మేలు చేసేది కేసీఆర్ సారు ఒక్కరే. రైతులంతా ఆయన వెంటే ఉన్నరు. మళ్లీ ఆయనే వస్తడు.

**– చెన్నగోని వెంకటేశంగౌడ్, రైతు, ఎస్.లింగోటం, చౌటుప్పల్ మండలం**